క్లుప్తంగా

ఉగాది ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి


మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నాయుడుపేట టౌన్/సైదాపురం : శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో ప్రజల జీవితాల్లో వెలుగులు విరజిమ్మాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. వారు శనివారం ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ తెలుగు సంవత్సరాదిన ప్రతి ఒక్కరూ అభివృద్ధి పథంలో నడవాలని కోరారు. ఉగాదిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ అధ్యక్షుల నియామకం

చిల్లకూరు : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం గూడూరు నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్స్ అధ్యక్షుడిగా గూడూరుకు చెందిన కలికి జనార్ధన రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ అధ్యక్షుడిగా సూళ్లూరుపేటకు చెందిన జే రాజగోపాల్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

చిట్టమూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దడమే తమ సంస్థ ఉద్దేశమని మాండలేజ్ మ్యాజిక్ బస్ సంస్థ మేనేజర్ ఆనంద్ తెలిపారు. మెట్టు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం స్పోర్ట్స్ ఫెడరేషన్ మీట్ నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. చిట్టమూరు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ భరత్ మహీపతి మాట్లాడుతూ పేదవిద్యార్థులను ప్రోత్సహిస్తే బాగా రాణిస్తారని తెలిపారు. పాఠశాల స్థలదాత పుచ్చలపల్లి నరేష్ రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజ్‌కుమార్, మ్యాజిక్ బస్ ప్రోగ్రాం డైరెక్టర్ సుమంత్, కోచ్ సుప్రియ, చైతన్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాగయ్యకు నివాళి


నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : వాకాడు మాజీ సర్పంచి దువ్వూరు భార్గవ్‌రామ సోదరుడు దువ్వూరు నాగయ్య(51) అనే రైతు శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకున్నారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆట వస్తువుల వితరణ


యూనిఫాం అందజేస్తున్న శశికిరణ్‌రెడ్డి

సైదాపురం: మండలంలోని చాగణం ఉన్నత పాఠశాలకు శనివారం కమలపూడి శశికిరణ్‌రెడ్డి నాలుగు డ్రమ్స్, 50 ఆట వస్తువులు, 100 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. శశికిరణ్ తండ్రి కమలపూడి సుబ్బరాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలతో పాటు ఊరికి మంచి పేరు తీసుకురావాలన్నారు. హెచ్‌ఎం మస్తానమ్మ, సర్పంచ్ పెంచలయ్య, నేతలు కమలపూడి సుబ్బరాఘవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులున్నారు.

వంద శాతం విద్యుత్ బిల్లులు వసూలు చేయాలి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట విద్యుత్ డివిజన్‌లోని నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి సబ్ డివిజన్‌లో వంద శాతం విద్యుత్ బిల్లులు వసూలు చేయాలని ఈఈ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పండుగ సెలవు అయినప్పటికీ విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు పనిచేస్తాయని, విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

వెంకటగిరి రూరల్ : ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి వసతిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తహసీల్దార్ రాంబాబు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సైదాపురం: మండలంలోని జోగిపల్లిలో వున్న కామాక్షిదేవి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కల్యాణ మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. ఒగ్గు కృష్ణయ్య, ఆదూరు కిషోర్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కలగానే డంపింగ్ యార్డు

సూళ్లూరుపేట మున్సిపాలిటీగా మారి 14 ఏళ్లు పూర్తయింది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు చెత్త డంపింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయలేదు. జాతీయ రహదారిని ఆనుకుని కాళంగి నది పక్కనే చెత్త వేస్తున్నారు. నెలలో నాలుగైదు సార్లు చెత్తను కాలుస్తుండడంతో పొగ పట్టణమంతా వ్యాపిస్తోంది. దీంతో శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. అంతేగాక చెత్త కుళ్లి నదిలోని నీరు కలుషితం అవుతోందని వాపోతున్నారు. పాలకులు స్పందించి చెత్త డంపింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

- ఫైళ్లకే పరిమితమైన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు
- కలుషితమవుతున్న కాళంగి నదీ జలాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


సూళ్లూరుపేట వద్ద చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి పక్కనే వేస్తున్న చెత్త

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మేజర్ పంచాయతీ నుంచి 2010లో గ్రేడ్-3 మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. ప్రస్తుతం పట్టణంలో అధికారికంగా 45,782 మంది, అనధికారికంగా మరో 40 వేల మంది జనాభా ఉన్నారు. పట్టణం నుంచి ప్రతిరోజూ 18 టన్నుల చెత్త వెలువడుతోంది. మున్సిపాలిటీలో 110 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వారు చెత్తను తొలగించి 9 వాహనాలద్వారా తరలిస్తున్నారు. ఇప్పటి వరకు డంపింగ్ యార్డు ఏర్పాటుచేయలేదు. ఈ క్రమంలో చెన్నై-కోల్‌కత్తా ఏషియన్ జాతీయ రహదారిని ఆనుకుని కాళంగి నది పక్కనే డంప్ చేస్తున్నారు. నెలలో నాలుగైదు సార్లు చెత్తను కాలుస్తున్నారు. దీంతో పొగ పట్టణమంతా వ్యాపిస్తోంది. ముఖ్యంగా వట్రపాళెం, ఇందిరానగర్, మహదేవయ్య నగర్, వనంతోపు, గణపతినగర్, ఝాన్సీనగర్, శ్రీనగర్‌కాలనీ, సూళ్లూరు, నాగరాజుపురం ప్రాంతాల్లో పొగ దట్టంగా కమ్ముకుంటుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కాళంగి నది కలుషితమవుతోంది. కాళంగి నదికి వరద వచ్చిన సమయంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పులికాట్ సరస్సులోకి చేరుతున్నాయి. చెత్త డంపింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేసి తమను ఆదుకోవాలని ప్రజలు పలుమార్లు అధికారులను కోరినా ప్రయోజనం లేదు. ప్రజల ఆరోగ్యాన్ని హరించినా, దుర్వాసనతో కూడా పొగ పట్టణమంతా వ్యాపించినా పట్టించుకునే వారే లేకుండా పోయారు.


కాళంగినదిలో పార్లు కట్టలా ఉన్న చెత్త

సూళ్లూరుపేట జనాభా	85,782 మంది
రోజూ వెలువడే చెత్త	18 టన్నులు
చెత్త తరలించే వాహనాలు	9
పారిశుద్ధ్య కార్మికులు	110 మంది

ఫైళ్లకే పరిమితమైన సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద తడి, పొడిచెత్తను వేరుచేసి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేస్తామని అధికారులు, పాలకులు ప్రకటించారు. ఇందులో భాగంగా డంపింగ్ యార్డు ఏర్పాటుకోసం మన్నారుపోలూరు వద్ద స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ ఫైలు ముందుకు కదల్లేదు. తర్వాత సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ల గురించి ఎవరూ పట్టించుకోలేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో వున్న ప్రభుత్వ భూముల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కును నిర్మించి చెత్తను తరలించాలని స్థానికులు చెబుతున్నా పాలకులు, అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

ముక్కులు మూసుకుని బతుకుతున్నాం



చెత్తను కాళంగి నది పక్కనే వేస్తున్నారు. చెత్త కుళ్లి దుర్గంధం వెదజల్లుతుండడంతో ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. ఊరికి దూరంగా చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని పలు మార్లు కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. చెత్తను కాల్చినప్పుడు వచ్చే పొగతో ఊపిరి పీల్చుకోలేకపోతున్నాం.
– రజియా, వనంతోపు

అనారోగ్యం బారిన పడుతున్నాము



చెత్త నుంచి వచ్చే దుర్గంధంతో ముక్కు పుటాలు పగిలిపోతున్నాయి. అనారోగ్యం బారిన పడుతున్నాం. దోమలు, ఈగలు, పందుల బెడద ఎక్కువగా వుంది. చెత్తను తగలబెట్టినప్పుడు వచ్చే పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చెత్త డంపింగ్ కేంద్రాన్ని పట్టణానికి దూరంగా ఏర్పాటు చేయండి సార్.
– హుస్సేన్, గణపతినగర్

రాత్రిళ్లు అటువైపు వెళ్లలేం



సుగ్గుపల్లి నుంచి సూళ్లూరుపేట పట్టణానికి నిరంతరం రాకపోకలు సాగిస్తున్నాము. ఈ రోడ్డు మీదకు చెత్త వస్తుండడంతో రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. కాళంగి నది చెత్తతో కలుషితం అవుతోంది. ఇరిగేషన్ అధికారులు, పాలకులు ఏమీ పట్టనట్టు చోద్యం చూస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.
– గాలి మల్లికార్జున్‌రెడ్డి, మాజీ సర్పంచ్, సుగ్గుపల్లి

తెలుగు సంప్రదాయాలను భావి తరాలకు అందిద్దాం


కోలాటం ఆడుతున్న విద్యార్థులు

చిట్టమూరు : మన తెలుగు సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందిద్దామని టీఎమ్మార్ స్కూల్ కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి తెలిపారు. కొత్తగుంటలోని టీఎమ్మార్ స్కూల్‌లో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు ఉగాది విశిష్టతను తెలియజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ రహంతుల్లా, మేనేజర్ ఆశ శ్రీనివాసులు, టీచర్లు అపర్ణ, వరలక్ష్మి, పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : ఉగాది పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని చింతవరంలోని రేస్ స్కూల్ కరస్పాండెంట్ బాల చెన్నయ్య పిలుపునిచ్చారు. పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది పండుగను జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగ షడ్రుచుల మేళవింపని, ఏడాదంతా జీవితం ఆనందంగా ఉండాలనే మన పూర్వీకులు ఇలా షడ్రుచులు అందించారని తెలిపారు. దీన్ని నేటి తరం పిల్లలు తెలుసుకుని సంప్రదాయాలకు పెద్ద పీట వేయాలని పిలుపునిచ్చారు.


ఉగాది పచ్చడిని చూపుతున్న చిన్నారులు

పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు

చిల్లకూరు : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేసే వారికి గుర్తింపు ఉంటుందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన శనివారం గూడూరు పట్టణం సనత్‌నగర్‌లోని తన నివాసంలో పార్టీ అనుబంధ కమిటీల నియామకంపై మండలాల కన్వీనర్లతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం 28 కమిటీలను ఏర్పాటు చేస్తోందన్నారు. వాటిలోకి సభ్యులను ప్రతి గ్రామం నుంచి ఒకరిని ఎంపి చేస్తామన్నారు. పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. ఇకపై నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సందర్శిస్తానని, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గూడూరు మున్సిపాలిటీలో అనుబంధ కమిటీల ఎంపికలో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి సోమవారం తన నివాసంలో ఉంటానని, ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో గూడూరు పట్టణ, రూరల్, కోట, చిట్టమూరు మండలాల పార్టీల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నాయకులు మండ్ల సురేష్‌బాబు, రాజేష్‌కుమార్, జలీల్, సుభాన్, దిలీప్‌రెడ్డి, అన్నంమురళీ, అబ్దుల్లా, రాజీవ్‌రామ్‌రెడ్డి, పూర్ణచంద్ర, బాబు, బట్ట గోపియాదవ్, సుజనారెడ్డి, సుప్రియ, సురేష్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.


నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

పెనుగొండ పీఠాధిపతికి ఘన స్వాగతం

గూడూరు రూరల్ : తిరుమలకు కాలి నడకన వెళుతున్న పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి బాల స్వామీజీకి గూడూరులో ఆర్యవైశ్యులు ఘన స్వాగతం పలికారు. ఆయన ప్రపంచ మానవాళి శాంతిని ఆకాంక్షిస్తూ తెనాలి నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఈ క్రమంలో గూడూరు చేరుకున్న ఆయనకు ఆర్యవైశ్య ప్రముఖులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయానికి తీసుకువచ్చారు. అక్కడ ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులను ఆశీర్వదించారు.


పెనుగొండ పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ప్రగతిలో ఆంగ్ల భాషపై ముగిసిన శిక్షణా తరగతులు

కోట: మండల కేంద్రమైన కోటలో వున్న శ్రీ ప్రగతి విద్యానికేతన్‌లో చెన్నై మ్యాక్ స్పీడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హలో ఇంగ్లిష్ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. విద్యా సంస్థ చైర్మన్ పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో ఆంగ్లభాష నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఆంగ్లంలో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు సాధించేందుకు వీలుగా మ్యాక్ స్పీడ్ సంస్థ సహకారంలో హలో ఇంగ్లిష్ కార్యక్రమం ద్వారా ఆరు నెలలు స్పోకెన్ ఇంగ్లిష్‌పై నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆంగ్ల భాషలో నాటకాల ప్రదర్శన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మ్యాక్ స్పీడ్ ప్రతినిధి సూర్య తదితరులు పాల్గొన్నారు.



ప్రగతిలో ఆంగ్లభాష శిక్షణ ముగింపు వేడుక

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు భూసమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. మండల సమావేశానికి కింద స్థాయి సిబ్బందిని పంపించడంపై అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తమకు తెలియజేస్తే కొత్త బోరు వేయడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మూగజీవాల కోసం నీటి తొట్టెల ఏర్పాటుకు నివేదికలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినీల్‌కుమార్, ఏవో శిరిష, పశువైద్యాధికారులు సుధీర్, లిఖిత, లియోన తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పశువులకు వైద్య పరీక్షలు

చిల్లకూరు : వేసవిలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని క్రిష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అద్దెపల్లిలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు వైద్య పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ కేఎఫ్‌పీసీఎల్ అదానీ క్రిష్ణపట్నం పోర్టు లిమిటెడ్ అదాని ఫౌండేషన్ సహకారంతో పశువుల సంరక్షణకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. పశువులు దాహార్తిని తీర్చుకునేందుకు సిలికా గుంతలో కూరుకుపోయే ప్రమాదం ఉందని తెలిపారు. యజమానులు పశువులకు బీమా చేయిస్తామన్నారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ బాబు, కంపెనీ ప్రతినిధులు సాయినాథ్, ప్రసన్నకుమార్, నవీన్ పాల్గొన్నారు.

సింపోజియంలతో విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీత

గూడూరు రూరల్ : సింపోజియంల ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీయవచ్చని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య తెలిపారు. ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియం శనివారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ ప్రయాగ్–2కే25 హ్యాక్ విత్ నెల్లూరు పేరుతో సింపోజియం ఏర్పాటుచేశామన్నారు. ఇందులో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొని పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, సర్క్యూట్ డి బగ్గింగ్, ఏఐ ప్రాంటింగ్ కోడ్ తదితరాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజా మురుగదాసు, కన్వీనర్ అమరేంద్ర జడ్డా, ఉమా ప్రత్యూష, ఏవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

కోట: ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తినడం వల్ల ఆరోగ్యం కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా సమన్వయకర్త రవిచంద్ర ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం ఐసీఆర్‌పీలకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ పది మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పురుగు మందులు లేకుండా కషాయాల ద్వారా పంటలు పండించడంపై రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏవో నిరంజన్ కుమార్, ఏపీఎం అనీల, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రూ.3.75 లక్షల రికవరీ

పెళ్లకూరు: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ కింద చేసిన 637 పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 637 పనులకు రూ.11,90,36,574 ఖర్చు చేసినట్లు డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. వాటిపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేసి నివేదికలు అందజేసినట్టు పేర్కొన్నారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు రికార్డుల నిర్వహణను సక్రమంగా చేపట్టని ఏపీవో దయానంద్ నుంచి రూ.1,26,481లు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.1,29,465లు, కంప్యూటర్ ఆపరేటర్ నుంచి రూ.39,180లు, జేఈ నుంచి రూ.20,815లు, టీఏ నుంచి రూ.59,418లు రికవరీ చేయాలని ఆదేశించారు. తాళ్వాయిపాడు, శిరసనంబేడు ఫీల్డ్ అసిస్టెంట్లపై కేసులు నమోదు చేసి పూర్తి స్థాయిలో నిధులు రికవరీ చేయాలని అధికారులకు సూచించారు. జీలపాటూరులో గోకులం షెడ్ పూర్తయి మూడు నెలలు అవుతున్నా నిధులు చెల్లించలేదని సర్పంచ్ కందమూడి శివకుమార్ పీడీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, ఏపీడీ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

కనుల పండువగా ఊంజల్ సేవ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లకు ఊంజల్ సేవను కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి అలంకార మండపంలోకి వేంచేపు చేసి తిరుచ్చిపై కొలువుదీర్చారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవను నేత్రపర్వంగా చేపట్టారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ఎన్నిక

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పెసల జయరాజగోపాల్, అధ్యక్షుడిగా కోటా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా మెంటా మల్లికార్జునరావు, కోశాధికారిగా దోర్నాదుల మధుసూదన్‌రావు, గౌరవ సలహాదారులుగా కనమర్లపూడి సుబ్రమణి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గాంధంశెట్టి భాస్కర్, మెంటా కృష్ణారావు, యచ్చా లక్ష్మీనారాయణ, గాంధంశెట్టి శ్రీరాములు, 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వారు ఆదివారం సాయంత్రం వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ప్రమాణస్వీకారం చేస్తారని నాయకులు వెల్లడించారు.

చలివేంద్రం ప్రారంభం

నాయుడుపేట టౌన్ : స్థానిక గడియారం సెంటర్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం డీఎస్పీ చెంచుబాబు ప్రారంభించారు. అనంతరం సీఐ బాబితోపాటు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ తాగునీటితో పాటు మధ్యాహ్నం మజ్జిగ అందజేయాలని సిబ్బందికి సూచించారు. ఎస్‌ఐ ఆదిలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్ రాజు, కానిస్టేబుల్ అన్ను దయాకర్ తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ

వక్ఫ్ బోర్డు నిర్వీర్యానికి కుట్ర

గూడూరు రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వక్ఫ్‌బోర్డు నిర్వీర్యానికి కుట్రలు చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి ముగ్దుం మొహిద్దీన్ ఆరోపించారు. ఆయన శనివారం గూడూరులో విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలిపి, ఇక్కడ ఇఫ్తార్ విందులు ఏర్పాటుచేస్తూ ముస్లింలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. ఇఫ్తార్ విందుకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు వక్ఫ్ బిల్లుపై స్పష్ట ఇవ్వాలని కోరారు.

రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు

నాయుడుపేట టౌన్ : సూళ్లూరు పేట నియోజవర్గ అభివృద్ధికి మున్సిపల్ శాఖ మంత్రి నారా యణ రూ.8 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే నెలవల విజ యశ్రీ తెలిపారు. ఆమె శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపికతో కలిసి నాయుడుపేటలోని విశ్వభారతి పాఠశాల నుంచి మక్కా మసీదు వరకు రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. మెప్మా అధికారులు, ఆర్పీలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ షేక్ రఫీ, కమిషనర్ షేక్ ఫజులుల్లా, నాయకులు కటకం జయరామయ్య, చేవూరి చెంగయ్య, బాబు, నానాబాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కుల్లూరు వీవోఏకు మెమో

కలువాయి(సైదాపురం): మండలంలోని సంఘ బంధం నిధులను దుర్వినియోగం చేసినట్టు వచ్చిన ఆరోపణలపై కుల్లూరు వీవోఏకు మెమో జారీ చేసినట్టు సంఘ బంధం అధ్యక్షుడు తెలిపారు. సంఘ బంధం అకౌంట్‌తో పాటు రికార్డులను తక్షణమే అప్పగించాలని మెమోలో పేర్కొన్నారు.

టైనీటాట్స్ స్కూల్ యాజమాన్యంపై ఫిర్యాదు

సూళ్లూరుపేట : 2025-26 సంవత్సరానికి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్న సూళ్లూరుపేటలోని టైనీ టాట్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం డీఈవోకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. ఐఐటీ, జేఈఈ, నీట్ కోర్సుల పేరుతో విద్యార్థులను మోసం చేస్తున్నారని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఓం రాజు తదితరులు పాల్గొన్నారు.